సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 3 । మే । 2025



జిల్లాలో పోలీసుల తనిఖీలు
శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కడప నగరం, జిల్లాలోని ప్రధాన ప్రాంతాల కూడళ్లు, లాడ్జీలలో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. -10లో



ఈదురు గాలులకు నేలవాలిన పంటలు
జిల్లాలో గురువారం రాత్రి ఈదురు గాలులు, అకాల వర్షానికి మామిడి, అరటి, బొప్పాయి, మునగ వంటి పలు ఉద్యాన పంటలు నేలకొరిగాయి. -10లో

గరిష్టం/కనిష్టం
40.2 /26.6

వాతావరణం
జిల్లాలో శుక్రవారం 26.2 – 40.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పరీక్ష ఫీజు గడువు పొడిగింపు
కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపునకు ఈ నెల 5 వరకు ఇంటర్ బోర్డు గడువు పొడిగించినట్లు ఇంటర్ ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి ఇంకా ఫీజు చెల్లించని వారు ఎవరైనా ఉంటే తక్షణం చెల్లించాలని ఆయన సూచించారు. ఈ చివరి అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు.

5 నుంచి వ్యవసాయ పరిశోధన సమావేశం
కడప అగ్రికల్చర్: కడప నగర శివారులోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈ నెల 5, 6 తేదీలల్లో దక్షిణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్ తెలిపారు. ఈ సమావేశంలో 2025–26 ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి పరిశోధన, విస్తరణ కార్యక్రమాలు, ప్రగతి విషయాలపై చర్చించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రైతుల అభ్యున్నతి కోసం చేయాల్సిన కార్యక్రమాలపై కూడా చర్చించడం జరుగుతుందని తెలిపారు. మరింత సమాచారం కోసం విస్తరణ విభాగం శాస్త్రవేత్త మహేష్‌బాబు (సెల్ నంబర్ :8555840753)ను సంప్రందించాలని ఆయన వివరించారు.

కార్మిక చట్టాలపై అవగాహన
కడప అర్బన్: అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు కార్మిక శాఖ సహాయ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని వారి సూచనల మేరకు, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫకృద్దీన్ మే డే అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 1 నుంచి 7 వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపడుతున్నారు. శుక్రవారం కడప నగరం సంధ్యా సర్కిల్‌లో అసంఘటిత భవన నిర్మాణ, గృహ కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు సురేష్ సహాయం, జిలానీ పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు



మాట్లాడుతున్న క్యాంప్ కమాండెంట్ సూర్యనారాయణమూర్తి

కడప ఎడ్యుకేషన్: ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలతోపాటు క్రమశిక్షణ అలవడుతుందని క్యాంప్ కమాండెంట్ కల్నల్ సూర్యనారాయణమూర్తి తెలిపారు. శుక్రవారం కడప నగర శివారులోని తెలుగంగ కాలనీలో 30వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ ఎస్.సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ఒకటవ కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ శిబిరంలో కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి దాదాపు 500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్.జె.ఆత్రే, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్, జగదీష్, సురేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెయ్యేరుకు గర్భశోకం



బుడుగుంటపల్లె బ్రిడ్జి వద్ద ఇసుక కోసం బారులు తీరిన టిప్పర్లు (వృత్తంలో)

- మంత్రి అండతో అనుయాయుల అరాచకాలు
- నిత్యం వందలాది టిప్పర్లతో ఇసుక అక్రమ రవాణా
- నదిలో నుంచే హిటాచీల ద్వారా లోడింగ్
- చిత్తూరు, కుప్పం, మదనపల్లె, తమిళనాడు, బెంగళూరుకు తరలింపు
- అడుగంటుతున్న భూగర్భ జలాలతో పల్లెల్లో ఆందోళన

సాక్షి టాస్క్‌ఫోర్స్: అన్నమయ్య జిల్లాలో చెయ్యేరును పచ్చ తోడేళ్లు చెరబట్టాయి!. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అనుయాయులు నిత్యం వందలాది టిప్పర్లతో చెయ్యేరు నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా రాజంపేట నియోజకవర్గం బాలరాజుపల్లె సమీపంలోని బుడుగుంటపల్లె డీసిల్టేషన్ నుంచి ఇసుక తరలిపోతోంది. అన్నమయ్య జిల్లాలో మొత్తం ఆరు రీచ్‌లు ఉన్నాయి. టంగుటూరు, కోమంతరాజుపురం, నారాయణ నెల్లూరుతోపాటు మిగిలిన మూడింటికి బుడుగుంటపల్లె వద్ద డీసిల్టేషన్ పాయింట్లు ఉన్నాయి. బుడుగుంటపల్లె ఇసుక పాయింట్లు రాయచోటికి దగ్గరగా ఉండటంతో మంత్రి పేరు చెప్పి అనుయాయులు యథేచ్ఛగా దోపిడీకి తెర తీస్తున్నారు. ఇక్కడ చెక్‌పోస్టులు నామమాత్రంగా మిగిలాయి.



చెయ్యేరులో హిటాచీ ద్వారా ఇసుకను తోడుతున్న దృశ్యం

అన్నమయ్య నుంచి తమిళనాడు, కర్ణాటకకు..
బుడుగుంటపల్లెలోని చెయ్యేరు పాయింట్ నుంచి ఇసుక రాష్ట్ర సరిహద్దు దాటుతోంది. కుప్పం, పుంగనూరు, చిత్తూరులో కెనాల్ పనుల కోసమంటూ నదిలో నుంచే హిటాచీలతో తవ్వేస్తూ ఇసుకను టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇసుక టిప్పర్లు తమిళనాడుకు వెళుతున్నట్లు డ్రైవర్లే చెబుతున్నారు. పెద్ద ఎత్తున ఇసుక దోపిడీ జరుగుతున్నా మైనింగ్‌శాఖ కళ్లు మూసుకుని కూర్చుంది.

ఎటు చూసినా భారీ గుంతలే..
అన్నమయ్య జిల్లాలో రీచ్‌లన్నీ చెయ్యేరు నదిలోనే ఉన్నాయి. ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా తవ్వేస్తుండటంతో నది గర్భశోకంతో విలవిల్లాడుతోంది. చిత్తూరు, కుప్పం, మదనపల్లెతోపాటు చెన్నై, బెంగళూరుకు రాత్రి వేళ టిప్పర్లలో చేరవేస్తున్నారు. నాణ్యమైన చెయ్యేరు ఇసుకకు మంచి డిమాండ్ ఉండటంతో ఎక్కడికక్కడ తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కడ చూసినా చెయ్యేరు భారీ గుంతలతో కనిపిస్తోంది. తాగునీటితోపాటు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బుడుగుంటపల్లె వద్ద చెయ్యేరు నదిలో ఏర్పడిన గుంతలు

ఇసుక దోపిడీపై సమగ్ర విచారణ జరపాలి
రాయచోటి సమీపంలోని ఇసుక క్వారీ నుంచి పెద్ద ఎత్తున ఇసుక దోపిడీ జరుగుతోంది. దీనికి సంబంధించి అనేకమార్లు ఫిర్యాదు చేశాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇసుక ప్రతిరోజు వందలాది టిప్పర్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలి వెళుతోంది. సహజ వనరులైన ఇసుక, మట్టి దోపిడీ చేస్తున్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆలోచించుకోవాలి.
– గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

'లాంగ్‌మార్చ్' విజయవంతం చేయాలి
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా

కడప సెవెన్‌రోడ్స్: వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలో జరగనున్న లాంగ్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా సెక్యులర్ భావాలు కలిగిన పార్టీలు, సంఘాలు, వ్యక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. ఇప్పటికే వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం రాత్రి 9 నుంచి 9.15 గంటల వరకు దీపాలు ఆర్పి నిరసన వ్యక్తం చేశామన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు గౌస్‌నగర్ నుంచి ప్రారంభమయ్యే లాంగ్‌మార్చ్ కార్యక్రమం మాసాపేట, పెద్దదర్గా, శివలింగంబీడి, అల్మాస్‌పేట, చిలకలబావి, మట్టిపెద్దపులి వీధి, రెండవ గాంధీబొమ్మ, 1వ గాంధీబొమ్మ, పొట్టిశ్రీరాములు విగ్రహం మీదుగా ఏడురోడ్ల కూడలికి చేరుకుంటుందని వివరించారు. అక్కడ జరిగే కార్యక్రమంలో మత పెద్దలతోపాటు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, లౌకిక భావాలు కలిగిన ప్రజలు, సంఘాల వారు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమం ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో జరుగుతుంది గనుక ఎవరూ తమ పార్టీలకు సంబంధించిన జెండాలు, బ్యానర్లు వంటివి ప్రదర్శించరాదని కోరారు. కేవలం జాతీయ జెండాతోపాటు నల్ల బ్యాడ్జీలు మాత్రమే ర్యాలీలో ఉంటాయన్నారు. ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలు లాంగ్‌మార్చ్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం

- వైభవంగా పుష్పగిరి బ్రహ్మోత్సవాలు
- స్వాములు, అమ్మవార్లకు విశేష పూజలు
- భారీగా పాల్గొన్న భక్తజనం
- మార్మోగిన హరిహరుల నామస్మరణ



శ్రీ లక్ష్మీచెన్నకేశవుని రథోత్సవం(ఇన్‌సెట్) రథంపై శ్రీదేవి, భూదేవితో కొలువు దీరిన చెన్నకేశవుడు



వైద్యనాథస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు (ఇన్‌సెట్) రథంలో కొలువైన శ్రీకామాక్షీ వైద్యనాథులు

వల్లూరు: పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం హరిహరుల రథోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. పుష్పగిరి భక్తజన సంద్రంగా మారింది. ఉదయం శ్రీ వైద్యనాథేశ్వరస్వామి రథోత్సవం జరిగింది. శ్రీ కామాక్షీ సమేతుడైన వైద్యనాథస్వామి రథంలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం శివ నామాన్ని స్మరిస్తూ భక్తులు పోటీ పడి రథాన్ని లాగారు. కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

- సాయంత్రం శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం జరిగింది. బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచి గ్రామోత్సవాలలో వివిధ వాహనాలపై ఒంటరిగా దర్శనమిచ్చిన చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవంతో పరిపూర్ణుడై శ్రీదేవి, భూదేవిలతో కలిసి రథంపై ఆశీనులయ్యారు. బంగారు ఆభరణాలతో అలంకార భూషితులైన స్వామివారు ఇద్దరు దేవేరులతో కలిసి దర్శనమివ్వడంతో.. సాక్షాత్తు వైకుంఠంలోని శ్రీహరి అంశకు చెందిన శ్రీ వెంకటేశ్వరున్ని దర్శించుకున్నట్లుగా భక్తులు పులకించి పోయారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో రథం వద్ద పూజలు చేశారు. అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రథ సంప్రోక్షణ, అభిషేకాలు నిర్వహించారు. రథ ప్రారంభ పూజ, వాస్తు పూజ, శాంతి, అష్టబలి, కుష్మాండబలి, ఉత్సవ మూర్తుల దేవతా రాధన, మహా మంగళ హారతి నిర్వహించారు. గోవింద నామాలను జపిస్తూ భక్తులు రథం గొలుసులను పట్టుకుని లాగారు. పుష్పగిరి మాడ వీధుల్లో భక్తులు కాయ కర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.
- రథాల వద్ద జరిగిన పూజల్లో పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యాశంకర భారతి, ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పుష్పగిరిలో నేడు
పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి శ్రీ కామాక్షీ వైద్యనాథస్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి అశ్వవాహనంపై దర్శనమివ్వనున్నారు.

పూజల్లో పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు
పుష్పగిరిని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీ నరేన్ రామాంజులురెడ్డి సందర్శించారు. కొండపైన గల శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి వారిని, లక్ష్మీదేవిని, సంతాన మల్లేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని శ్రీ వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని, శ్రీ కామాక్షీ మాతను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యాశంకరభారతి స్వామిని దర్శించుకుని ఆయనచే ఆశీర్వచనాలను పొందారు. అనంతరం శ్రీ వైద్యనాథ స్వామి రథోత్సవంలో భాగంగా రథం వద్ద జరిగిన పూజల్లో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, బాకరాపురం వెంకట సుబ్బారెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



ఆ శాఖలో.. కీచకుడు!

వైద్య ఆరోగ్య శాఖలో అతనొక నియంత. మహిళా సిబ్బందిని చూస్తే పైశాచికత్వం తన్నుకొస్తుంది. పేరుకు సీనియర్ అసిస్టెంట్ అయినప్పటికీ పెత్తనం అంతా అతనిదే. అతనికి ఒళ్లంతా 'వంకర'బుద్ధే. మహిళా సిబ్బంది అంటే మచ్చుకైనా మర్యాద ఉండదు. అతడి వెకిలి చేష్టలు శ్రుతి మించాయి. ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

- మహిళా సిబ్బందికి వేధింపులు
- ఫోన్‌లో అసభ్య పదజాలం
- నన్నెవరూ ఏమీ చేయలేరంటూ బెదిరింపులు
- మితిమీరిన 'ఛీనియర్ అసిస్టెంట్ చేష్టలు



సాక్షి టాస్క్‌ఫోర్స్ : వైఎస్సార్ జిల్లాలో గల వైద్య ఆరోగ్య శాఖలో అదొక అంటువ్యాధికి సంబంధించిన విభాగం. ఆ విభాగంలో పనిచేస్తున్న ఒక సీనియర్ అసిస్టెంట్, మహిళా సిబ్బంది పట్ల 'శాడిస్ట్'లా ప్రవర్తిస్తున్నాడు. మహిళలను వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో ఆ సంస్థలో పనిచేసే మహిళా సిబ్బంది, ఆ కామాంధుడిని ఎదిరించలేక బిక్కు బిక్కు మంటూ విధులను నిర్వహిస్తున్నారు. ఈ అంశం ఆలస్యంగా వెలుగు చూసింది.

ఏమీ చేయలేరనే అహంకారంతో...
ఆ శాఖలో అతను రెగ్యులర్ ఉద్యోగి, సీనియర్ అసిస్టెంట్. ఆ సంస్థలో పనిచేసే మహిళలంతా దాదాపుగా కాంట్రాక్టు ఉద్యోగులే. అతనికి మహిళలంటే చాలా చులకన భావం. పలువురు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. గతంలో ఒక మహిళ ఉద్యోగి పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే, వారి బంధువులు వచ్చి గొడవకు దిగారు. ఇలా కొంతమందిని వేధింపులకు గురి చేశాడు. కాగా అతను చేసే అవినీతి పనుల్లో, ఆ ఉద్యోగి కింద పనిచేసే కొందరి పాత్ర కూడా ఉంది. దీంతో ఆ ఉద్యోగి ఏ వెధవ వేషాలు వేసినా కిందిస్థాయి సిబ్బంది సహకారం ఉంటుంది. ఆ ఉద్యోగి నన్నెవరూ ఏమీ చేయలేరంటూ పదేపదే చెప్పుకోవడం విశేషం.

తారాస్థాయికి చేరిన వ్యవహారం
ముఖ్యంగా ఒక మహిళా సిబ్బంది పట్ల అతను చాలా అనుచితంగా ప్రవర్తించాడు. ఆ మహిళ కనిపించకపోతే వెంటనే ఫోన్ చేస్తాడు. 'ఏమే.. ఎక్కడున్నావ్' అంటూ ఏక వచనంతో సంభోదించడమే కాక రాయలేని విధంగా పచ్చి బూతులు మాట్లాడతాడు. పాపం ఆ మహిళా సిబ్బంది నిరుపేద. కుటుంబాన్ని పోషించుకోవాలంటే ఈ ఉద్యోగం తప్పనిసరి. అందుకని తప్పని పరిస్థితుల్లో సర్దుకుపోతూ వచ్చింది. ఆ ఉద్యోగి మాటలను భరిస్తూ వచ్చింది. వేధింపులను ఇక తట్టుకోలేక, ఈ అంశాలను ఆ శాఖకు చెందిన అధికారులకు తెలిపింది. 'అతను ఇక్కడ ఉంటే నేను ఉద్యోగం చేయలేను' అంటూ వాపోయింది. అయినప్పటికీ ఆ కీచక ఉద్యోగిలో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. దీంతో ఆమె ఎవరికీ చెప్పుకోలేక, ఆ ఉద్యోగి వేధింపులు తట్టుకోలేక మనోవేదనకు గురైంది.

ఫిర్యాదు చేసినా కూడా...
ఇటీవల ఆ శాఖపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణకు ఆ సంస్థలో పనిచేసే సిబ్బంది అంతా వచ్చారు. ఈ సందర్భంగా పలువురు మహిళా సిబ్బంది ఆ ఉద్యోగి వేధింపులు తట్టుకోలేకపోతున్నామని ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కూడా ఆ ఉద్యోగిలో ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం. కొద్ది రోజుల తర్వాత తప్పని పరిస్థితుల్లో వేధింపులకు గురవుతున్న మహిళా సిబ్బంది ఏప్రిల్ 3న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సాక్ష్యాధారాలతో కలెక్టరేట్‌కు వెళ్లారు. అక్కడ కలెక్టర్ లేకపోవడంతో అక్కడ పనిచేసే సిబ్బందికి ఫిర్యాదు పత్రాన్ని సమర్పించారు. ఈ ఫిర్యాదు పై స్పందన రావాల్సి ఉంది. ఈ అంశం ఆ నోటా ఈ నోటా పడి చర్చనీ యాంశంగా మారింది. కొన్ని రోజులుగా ఆ ఉద్యోగి సెలవులో ఉన్నాడు. ఆ ఉద్యోగి సెలవుపై వెళ్లాడా.. లేక ఎవరైనా వెళ్లమన్నారా అనే చర్చ సాగుతోంది. బరి తెగించిన ఆ ఉద్యోగి అంశం ఆ శాఖతో పాటు బయట కూడా తీవ్ర సంచలనంగా మారింది. కాగా అధికారులు వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి. అలాగే మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఆరాధనోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

బ్రహ్మంగారిమఠం: కాలజ్ఞాన ప్రబోధకర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజ మహోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్ తెలిపారు. ఉత్సవాలు ఈ నెల 4 నుంచి 9 వరకు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం ఆర్డీఓ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా వస్తారని తెలిపారు. మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ మాట్లాడుతూ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు మజ్జిగ, నీరు, చలువ పందిర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ రాజ్యలక్ష్మి, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ప్రొద్దుటూరు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వినోద్‌కుమార్, ఎండోమెంట్ ఏసీ మల్లికార్జున, డీయల్‌డీఓ బద్వేలు శ్రీనివాసులరెడ్డి, మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, తహసీల్దార్ దామోదర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరకిషోర్, డీటీ జాన్స్, స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

మత్స్యశాఖ డీడీగా శ్యామలమ్మ
కడప అగ్రికల్చర్: మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్(ఎఫ్ఏసీ)గా శ్యామలమ్మ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీడీగా పని చేస్తున్న శాంత పదోన్నతిపై వెళ్లారు. ఆమె స్థానంలో నంద్యాలలో ఏడీగా ఉన్న శ్యామలమ్మకు ఎఫ్ఏసీ డీడీగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.

ఈదురు గాలులకు.. నేలవాలిన పంటలు

వేల రూపాయలు ఖర్చుచేసి సాగు చేసిన పంటలు తీరా దిగుబడి చేతికొచ్చే సమయంలో ఈదురు గాలులు, అకాల వర్షాలతో నేల కొరిగింది. కష్టపడి సాగు చేసిన అన్నదాతలకు బారీ నష్టం మిగిల్చింది. సాగు ఖర్చు కూడా చేతికి రాకుండానే అప్పులు మూటగట్టుకోవాల్సి వచ్చింది.

- ఆరటి, మామిడి, బొప్పాయి, మునగ పంటలకు నష్టం
- జిల్లా రైతులకు రూ. 87.37 లక్షల మేర నష్టం అంచనా
- ఉన్నతాధికారులకు నివేదిక పంపిన ఉద్యాన శాఖ


సిద్దవటం మండలంలో ఈదురుగాలులతో నేలకొరిగిన అరటిపంట


నేలకొరిగిన చెట్లు, విద్యుత్తు స్తంభం

కడప అగ్రికల్చర్ : జిల్లాలో గురువారం రాత్రి వీచిన ఈదుర గాలులు, అకాల వర్షంతో పలు మండలాల్లో మామిడి, ఆరటి, బొప్పాయి, మునగ వంటి పలు ఉద్యాన పంటలు నేలకొరిగాయి. అన్నదాతలకు రూ. రూ. 87.37 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు. ప్రధానంగా ఒంటిమిట్ట, పెండ్లిమర్రి, మైదుకూరు, సికె.దిన్నె, సిద్దవటం, అట్లూరు, పోరుమామిళ్ల, కాశినాయన, బిమఠం మండలాల్లో 297 మంది రైతులకు సంబంధించిన 252.60 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అంచనా.

దెబ్బతిన్న పంటల వివరాలివీ..

జిల్లా వ్యాప్తంగా కొన్ని మండలాల్లో అత్యధిక నష్టం జరిగింది. బ్రహ్మంగారి మఠంలో 71 మంది రైతులకు సంబంధించిన 81.3 హెక్టార్లలో అరటి, బొప్పాయి పంటలు తెబ్బతినగా రూ.27.85 లక్షల మేర నష్టం జరిగింది.

- సిద్దవటం మండలంలో 63 మంది రైతులకు సంబంధించిన 36 హెక్టార్లలో మామిడి, ఆరటి, బొప్పాయి పంటలు దెబ్బతినగా 11.84 లక్షల మేర నష్టపోయారు.
- మైదుకూరు మండలంలో 34 మంది రైతులు 26 హెక్టార్లలో సాగు చేసిన అరటి దెబ్బతిని రూ.9.10 లక్షలు నష్టపోయారు.
- ఒంటిమిట్ట మండలంలో 25 మంది రైతులు 22 హెక్టార్లలో వేసిన అరటిదెబ్బతిని రూ.7.70 లక్షలు, సికె.దిన్నె మండలంలో 37 మంది రైతులు సాగు చేసిన 22 హెక్టార్లలో అరటి, మామిడి, మనగ పంటలు దెబ్బతిని రూ.8.02 లక్షల నష్టం వాటిల్లింది.
- కాశినాయన మండలంలో 47 మంది రైతులకు సంబంధించి 43 హెక్టార్లలో రూ.15.05 లక్షలు, అట్లూరు మండలంలో 8 మంది రైతులకు సంబంధించి 5.20 హెక్టార్లలో నిమ్మ, మామిడి పంటలు దెబ్బతిని రూ.1.82 లక్షల నష్టం జరిగింది.
- కలసపాడు మండలంలో 5 మంది రైతలకు సంబంధించి 5.1 హెక్టార్లలో ఆరటి, మామిడి పంటలు దెబ్బతినగా రూ.1.75లక్షలు, పెండ్లిమర్రి మండలంలో ఐదుగురు రైతులకు సంబంధించి 8 హెక్టార్లలో అరటి దెబ్బతిని రూ. 2.80 లక్షల నష్టం వాటిల్లింది.

అంధకారంలో జమ్మలమడుగు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణ పరిసర ప్రాంతాలలో రాత్రి విపరీతమైన గాలులు, వర్షం ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. దీంతో పట్టణంలో అంధకారం అలుముకుంది. పట్టణంలోని తాడిపత్రి రహదారిలోని బాలాజీ హైస్కూల్ సమీపంలో చెట్టు విరిగి పడడంతో మూడు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. లక్ష్మీనగర్ కాలనీలో మరో మూడు స్తంభాలు విరిగి పడ్డాయి. వర్షం, గాలులు వీచడంతో వెంటనే ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. రాత్రి పది గంటల సమయంలో వర్షం తగ్గడంతో ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది వచ్చి మరమ్మతులు చేయడం ప్రారంభించారు. ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభాలు పడడంతో వాహనాలను అధికారులు దారి మళ్లించారు.


గాలుల ధాటికి విరిగి పడిన విద్యుత్ స్తంభాలు

కూటమి సర్కార్‌లో వ్యవస్థలు నిర్వీర్యం!

- ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన
- చంద్రబాబు సర్కార్‌లో ప్రజాస్వామ్యం కంటే వ్యక్తులకే ప్రాధాన్యత
- తొలిసారి మంత్రి పదవి హోదా దక్కినా నియోజకవర్గ ప్రయోజనం నిల్
- దోపిడీలు, దౌర్జన్యాలు, భూ ఆక్రమణలు, అరాచకాలకే ప్రాధాన్యత
- చితికిపోయినా సామాన్యులు, ఛిన్నభిన్నమైన వ్యాపార వర్గాలు
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: అపార అనుభవం అని చెప్పుకుంటూ వ్యవస్థలు నిర్వీర్యం చేశారు. ప్రజా సంక్షేమం లేదు. రైతులకు గిట్టుబాటు ధరల్లేవు. పెట్టుబడి నిధి లేదు. కొత్తగా ఒక్క ఉద్యోగం లేదు. ప్రవేటు సెక్టార్ అభివృద్ధి లేదు. ప్రజలకు చేయూతగా ఉన్న వాలంటీరు వ్యవస్థ లేదు. విద్యా దీవెన, వసతి దీవెన నిలిచిపోయాయి. మహిళలకు చేయూత ఆగిపోయింది. కాపు నేస్తం లేదు. చెప్పినవి ఇవ్వలేదు. ఇచ్చేటివి ఇవ్వలేదు. ప్రజాస్వామ్యం అసలే లేదని కూటమి సర్కార్‌పై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ 10 నెలల పాలనపై ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మహిళకు రూ.15వేలు బకాయి పడింది. కొత్తగా ఒక్క పెన్షన్ లేదు, రైతులు, మహిళలు, ఉద్యోగులు అన్నీ వర్గాలను చంద్రబాబు సర్కార్ మోసం చేసిందని ఆయన దెప్పిపొడిచారు.

మా పాలన ప్రజాశ్రేయస్సుకే అంకితం...

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు ప్రజలకు దగ్గరగా వారి శ్రేయస్సుకు అనుగుణంగా ఉండేవి. సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి ప్రజల చెంతకు పాలన తెచ్చారు. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి, రైతులకు అండగా నిలిచారు. హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రజల బాబోగులు చూశారు. ఆరోగ్యశ్రీ రూ.20 లక్షలకు పెంచి ప్రజల భద్రతగా నిలిచారు. ఆర్థికంగా అండగా నిలిచారు. ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా చిత్తశుద్ధితో సంక్షేమం అమలు చేశారు. ఇలాంటివి జనం ఊహించుకోలేదు. ప్రజలకు స్పష్టంగా అర్థం అవుతోంది. అప్పటికి.. ఇప్పటికీ తేడా, వారు కోల్పోయినా సంక్షేమం అన్నీ గమనిస్తున్నారు. అధికారం ఉందని ఇప్పుడు ఎగిరెగిరి పడే వారి కుటుంబాలకు కూడా సంక్షేమం అందేది. పూర్తిగా ప్రజా శ్రేయస్సుకు అంకితమై పాలన కొనసాగిందని శ్రీకాంత్‌రెడ్డి వివరించారు.

ఉపయోగం లేని మంత్రిత్వ హోదా...

రాయచోటి నియోజకవర్గానికి తొలిసారి మంత్రి హోదా లభించినా ఇక్కడి ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఇంతకాలం జిల్లా కేంద్రానికి నడిబొడ్డున రాయచోటి ఉంది, కాబట్టే జిల్లా ఇచ్చారని చెప్పుకున్నారు. పార్లమెంట్‌కు కూడా సెంటర్ పాయింటే, మరీ ఇవ్వలేదని ఆయన ధ్వజమెత్తారు. 70ఏళ్లుగా పాలనలో ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలు కూడా పెట్టలేని దుస్థితి ఉండిపోయింది. రాయచోటిని జిల్లా కేంద్రం చేసి ఎన్నో రంగాలల్లో అభివృద్ధి చేశాం. 15 సంవత్సరాల క్రితమే రూ.64కోట్లతో ఫోర్‌లైన్ రింగురోడ్డు ఏర్పాటు చేశాం. రూ.15వేల కోట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారం లభించింది. రాయచోటికి సంపద సృష్టించాం. జిల్లా కేంద్రం ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ అభివృద్ధి చేశాం. చుట్టూ 35 కిలోమీటర్లు పరిధిలో ప్రతి వ్యక్తి ఆస్తి 3రెట్లు అధికంగా పెరిగాయి. ఈ పదినెలల కాలంలో రియల్ ఎస్టేట్ కుప్ప కూలింది. సామాన్యులు చితికిపోయారు. వ్యాపార వర్గాలవారు చిన్నాభిన్నమయ్యారు. ఎటుచూసినా ఏరకమైనా అభివృద్ధి కనిపించలేదు. మంత్రి హోదా లభించడం వల్ల నియోజకవర్గానికి ఎలాంటి ప్రయోజనం లభించలేదని మాజీ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

» చట్టాలపై నమ్మకం లేకుండా పోతుంది...

మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి ప్రాపర్టీ దొంగతనం చేస్తే ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యల్లేవు. లక్కిరెడ్డిపల్లె జడ్పీటీసీ ఇంటిపై దాడి చేస్తే చర్యల్లేవు. అధికారం అండతోనే ఇవన్నీ చేశారు. చట్టాలు, పోలీసులపై నమ్మకం పోతుంది. మాజీ ఎమ్మెల్యే ఆస్థికే ప్రొటెక్షన్ లేదు. మాండవ్య నదీ లూటీ అవుతోంది. వందల టిప్పర్లు రింగు రోడ్డులో వెళ్తున్నాయి. ట్రాన్సుపోర్టు మంత్రిగా ఉంటూ అక్రమంగా వందలాది టిప్పర్లు మెటీరియల్‌తో నిర్భయంగా పోతుంటే దేనికి సంకేతం. మంత్రి అనుచరులు గ్యాంబ్లింగ్ కొనసాగిస్తున్నారు. కాని స్టేబుల్‌జూదం ఆడిస్తూ పట్టుబడ్డారు. లక్షలాది రూపాయాలు చేతులు మారుతున్నాయి. బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. రాజకీయ అండదండలతో ఆసాంఘిక కార్యక్రమాలు అధికమైయ్యాయని శ్రీకాంత్‌రెడ్డి వాపోయారు.

» మంత్రికి కప్పం కట్టాల్సిందే..

రాయచోటిలో ఎన్నడూ లేనివిధంగా కప్పం కట్టాల్సిన రోజులు దాపురించాయి. క్రషర్ యజమానులు మంత్రి కుటుంబసభ్యులకు నెలవారి కప్పం కట్టుతున్నారు. గతంలో ఈసంస్కృతి ఎన్నడూ లేదు. ఇలాంటి పరిస్థితులుంటే ఏకరంగా ఇక్కడికి పరిశ్రమలు వస్తాయి, పారిశ్రామికవేత్తలు వస్తారు. శిబ్యాల వద్ద 500 ఎకరాలు ఏపీఐఐసీ కోసం అప్పట్లో సిద్ధం చేశాం, బహిష్కరించారు. చివరకు ఉపాధి హామీ పనులు కూడా పారదర్శకంగా చేపట్టడం లేదు. ఎన్ఆర్జీఈఎస్ కూడా దోపిడీ దాయకంగా సాగుతోంది. చట్టాన్ని నిర్వీర్యం చేయడం, దోపిడీ చేయడం ప్రతి గ్రామంలో ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు.

సహజ వనరులు దోపిడీ....

ఆశ్చర్యకర విషయం ఏమిటంటే ప్రజాస్వామ్య విలువలు దిగజారిపోయాయి. ప్రభుత్వ అధికారులను అడ్డుపెట్టుకొని సహజ వనరుల దోపిడీ చేస్తున్నారు. ఈమాట ప్రతి నోటా వినిపిస్తోంది. రెవెన్యూ, పోలీసుశాఖలను అడ్డుపెట్టుకొని నిబంధనలు విరుద్దంగా వ్యవహరిస్తున్న తీరు కంట కన్పిస్తోంది. భూ ఆక్రమణలు అధికమయ్యాయి. చాలా మంది బాధితులు మాట్లాడుతున్న విషయం చూస్తున్నాం. మాపాలనలో ఐదేళ్ల ప్రభుత్వం ద్వారా సేకరించిన భూమి ప్రజల ఆస్తిగా సృష్టించాం. 100 ఎకరాల్లో కలెక్టరేట్, 11ఎకరాల్లో శిల్పారామం, 25 ఎకరాల్లో స్టేడియం, 45ఎకరాల్లో ఎకోపార్క్, జిల్లా పరిషత్‌కు 11 ఎకరాలు, రెసిడెంట్ బంగళాల కోసం తీర్చిదిద్దాం. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తిగా చేశాం. మా ప్రభుత్వ ఐదేళ్ల మాపాలన అలా ఉంటే, మంత్రి కుటుంబ సభ్యులు, అనుచరులు సహజ వనరులు దోపిడీ చేస్తున్నారు, భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు.

క్లుప్తంగా

యువతి ఆత్మహత్యాయత్నం

పోరుమామిళ్ల : పట్టణంలోని పాత చాకలవీధికి చెందిన స్వాతి(22) శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఏఎస్ఐ దుర్గామోహన్ వివరాల మేరకు.. స్థానికుడు అంజి అనే యువకుడిని స్వాతి ప్రేమ వివాహం చేసుకుంది. ఇటీవల స్వాతి అనారోగ్యానికి గురికావడం, అంజి వైద్యం చేయించకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసిందని ఏఎస్ఐ తెలిపారు. విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

కారు అద్దాలు ధ్వంసం


రాళ్ల దాడిలో పగిలిన కారు అద్దాలు

కడప అర్బన్ : కడప నగరం శంకరాపురంలో గురువారం రాత్రి గుర్తుతెలియని ఆకతాయిలు కారు అద్దాలను ధ్వంసం చేశారు. శంకరాపురానికి చెందిన వ్యక్తులకు సంబంధించిన మూడు కార్లు ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో కారుపై విసరడంతో ముందు, వెనుక అద్దాలు పగిలిపోయాయి. చిన్న చౌక్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

రైలు మరుగుదొడ్డిలో మృతదేహం



కడప కోటిరెడ్డిసర్కిల్ : ముంబయి నుంచి చెన్నైకు వెళుతున్న స్పెషల్ రైలు (01015)లోని ఎస్–6 బోగీ మరుగుదొడ్డిలో గుర్తుతెలియని మృతదేహాన్ని (35) రైల్వే పోలీసులు శుక్రవారం గుర్తించారు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కడప రిమ్స్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కడప రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ తెలిపారు.

65 మద్యం సీసాల సీజ్


వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ, ఎస్ఐలు

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : యర్రగుంట్ల రైల్వే స్టేషన్‌లో ఇద్దరు వ్యక్తుల నుంచి 65 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు యర్రగుంట్ల ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, జీఆర్పీఎఫ్ ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. యర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీఎఫ్ పోలీసులు శుక్రవారం సంయుక్తంగా తనిఖీలు చేశారన్నారు. పూణె ఎక్స్‌ప్రెస్ రైలులో నుంచి ఇద్దరు వ్యక్తులను అనుమానంతో తనిఖీ చేసి వారి నుంచి పాండిచ్చేరికి చెందిన 65 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.20 వేలు ఉంటుందన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఫ్లైయాష్ ట్యాంకర్ బోల్తా


అదుపు తప్పి బోల్తా పడిన ఫ్లైయాష్ ట్యాంకర్

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు–ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో ఫ్లైయాష్ ట్యాంకర్ శుక్రవారం అదుపు తప్పి బోల్తాపడి డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు నుంచి బయలుదేరిన ఫ్లైయాష్ ట్యాంకర్ జమ్మలమడుగు శివారుకు రాగానే జమ్మలమడుగు– ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు మలుపు వద్ద వేగాన్ని అదుపు చేయలేక సర్కిల్‌లోని ఫ్లడ్ లైట్లకు ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. డ్రైవర్ అపస్మారక స్థితిలో ఉండటంతో వివరాలు అందలేదు. ఈ విషయమై పట్టణ ఎస్ఐ రామక్రిష్ణ వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్య

ములకలచెరువు/మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ములకలచెరువు మండలంలో జరిగింది. చిన్నమొరవపల్లెకు చెందిన అమరనాథ్ రెడ్డికి, శిరీష(26)తో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. శిరీష మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేసేది. ఇటీవల కొంతకాలంగా తరచూ కుటుంబంలో గొడవలు జరుగుతుండటంతో ఉద్యోగం మానేసింది. ఈ క్రమంలో శుక్రవారం మరోసారి కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడింది. మనస్తాపం చెంది ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఔట్‌పోస్ట్ పోలీసులు వివాహిత మృతి సమాచారాన్ని ములకలచెరువు పోలీసులకు తెలియజేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రైతు ఇంట్లో బంగారు నగల చోరీ

కురబలకోటలో వరుస చోరీలతో కలకలం

కురబలకోట : మండలంలో మళ్లీ బంగారు నగలు చోరీ అయ్యాయి. అంగళ్లు దగ్గరున్న గొనివారిపల్లెలోని జి.సోమశేఖర్‌రెడ్డి ఇంటిలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని యువకులు ప్రవేశించి బీరువాలో దాచిన రూ.25 లక్షల విలువ చేసే 250 గ్రాముల బంగారు నగలను అపహరించారు. పోలీసులకు బాధితుడు తెలిపిన వివరాల మేరకు..గొనివారిపల్లెకు చెందిన సోమశేఖర్ రెడ్డి శుక్రవారం కుటుంబంతో సహా ఊరికి దగ్గరలోని టమాటా పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి రాగా తలుపు తెరచి ఉండడం కనరిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలు తెరచి ఉండడం.. మంచంపై చెల్లా చెదురుగా దుస్తులు పడి ఉండడం గమనించి అవాక్కయ్యారు. బీరువాలో రూ.25 లక్షలు విలువ చేసే 250 గ్రాముల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకుపైన పంచె కట్టుతో ఉన్న ఇద్దరు యువకులు ఊరిలో సంచరించినట్లు స్థానికులు చెబుతున్నారు. తెలిసిన వారింటికి చుట్టాలుగా వచ్చి ఉంటారని తొలుత భావించడంతో పసిగట్టలేకపోయారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ గ్రామంలో విచారణ జరిపారు. వేలి ముద్రలు, ఆధారాల సేకరణతో పాటు విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. యువకుల వస్త్రధారణను బట్టి ఇళ్లల్లో చోరీ చేయడంలో దిట్టగా ఉన్న తమిళనాడు గ్యాంగ్‌గా ఉన్నట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు. పోలీసులకు సవాల్ చేసేలా జరుగుతున్న ఈ దొంగతనాలు స్థానికులను కలవరపరుస్తున్నాయి.

అక్కడ ప్రెస్ మీట్...ఇక్కడ మళ్లీ..!

మండలంలో వరుస చోరీలు జరుగుతుండడంతో జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు ముందు ఇదే గొనివారిపల్లెలో హైవే పక్కనే ఉన్న ఇంటిలో బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత అంగళ్లులో హైవే పక్కన ఏడు షాపుల్లో చొరబడి సామాగ్రి, నగదు ఎత్తుకెళ్లారు. చేనేతనగర్‌లోని హార్డ్‌వేర్ షాపులో చొరబడి వస్తువులు పట్టుకెళ్లారు. ఇటీవల కురబలకోటలోని కువైట్ మస్తాన్, అదే ఊరికి చెందిన వరలక్ష్మి ఇంటిలో రెండిళ్లలో కేజీ దాకా బంగారు నగలు, నగదు చోరీకి గురయ్యాయి. ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ప్రెస్‌మీట్ నిర్వహిస్తుండగా అదే సమయంలో మండలంలోని గొనివారిపల్లెలో మళ్లీ కొత్తగా చోరీ జరగడం ఆందోళన కలిగిస్తోంది. రాకపోకలు సాగించేవారిని పసిగట్టడానికి ప్రతి ఊరికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడుతోంది. బ్యాంకుల్లో భద్రపరచుకోవడం ఉత్తమమని పలువురు భావిస్తున్నారు. ముందు జాగ్రత్తతో విలువైన వాటిని కాపాడుకోవడం ఉత్తమమని పోలీసులు చెబుతున్నారు.

సచివాలయ ఉద్యోగిపై కత్తితో దాడి

తంబళ్లపల్లె : స్నేహితుల మధ్య కలహాలతో ఓ గ్రామ సచివాలయ ఉద్యోగిపై కత్తితో దాడిచేసి గాయపరచిన సంఘటన గురువారం సాయంత్రం మండల కేంద్రంలో జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు..ఎర్రసానిపల్లె పంచాయతీ ఎర్రమద్దువారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు గణేష్(28) చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం పుదిపట్ల సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడికి కురబలకోట మండలం మట్లివారిపల్లెకు చెందిన ప్రవీణ్‌కుమార్ స్నేహితుడు. కొద్దిరోజుల క్రితం ప్రవీణ్ కుమార్‌ను తంబళ్లపల్లె మండలం చేలూరు వాండ్లపల్లెకు చెందిన మున్వర్ స్థానిక బస్టాండ్‌లో బహిరంగంగా దూషించాడు. ఈ విషయమై గణేష్, మున్వర్‌ను అతడు నా స్నేహితుడు.. ఎందుకు దూషించావని ప్రశ్నించాడు. దీనిపై ఆగ్రహించి అతడికి నీవు సపోర్ట్ ఏంట్రా... నీ అంతు చూస్తానని బెదిరించాడు. ఈ క్రమంలో గణేష్, గురువారం సాయంత్రం స్నేహితులతో కలిసి హరిత సర్కిల్‌లోని చికెన్ పకోడా సెంటర్ వద్ద ఉండగా మున్వర్, అతడి అన్న మహమ్మద్, శశిలు ద్విచక్ర వాహనంలో వచ్చి గణేష్‌పై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశారు. తలకు, ఎడమచేతి వేళ్లకు, కాళ్లకు రక్తగాయాలు కావడంతో చుట్టుపక్కల జనం అరవగా.. ముగ్గురు ద్విచక్రవాహనంలో పారిపోయారు. గాయపడిన గణేష్‌ను, స్నేహితులు సీహెచ్‌సీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమచికిత్సలు చేసి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఫిర్యాదుమేరకు దాడిచేసిన ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రాజంపేట : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందారు. చిట్వేలి మండలం నాగవరానికి చెందిన మూరి అనిత(28) పెద్దఓరంపాడులోని తన పుట్టింటి నుంచి రాజంపేటకు ఆటోలో బయలుదేరారు. కడప–రేణిగుంట జాతీయ రహదారిపై రాజంపేట పట్టణ శివారులోని అశోక్ గార్డెన్స్ వద్ద వీరి ఆటోను టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మూరి అనిత(28) అక్కడికక్కడే మృతిచెందారు. ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లెకు చెందిన ఆటో డ్రైవర్ అంజి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం అతడిని కడప రిమ్స్ తరలించారు. విషయం తెలుసుకున్న బంధువులు చేరుకు బోరున విలపించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో పోలీసుల తనిఖీలు


కడప నగరంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కడప అర్బన్ : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కడప నగరం, జిల్లాలోని ప్రధాన ప్రాంతాల కూడళ్లు, లాడ్జీలలో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఒక సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో ఏఎస్ఐ, పోలీసుల బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. ఐదుగురు సీఐలు, 8 మంది ఎస్ఐలు, 90 మంది బ్లూకోల్ట్, రక్షక్, పోలీసు సిబ్బంది పలు చోట్ల సోదాలు జరిపారు. దేవుని కడప, అల్మాస్‌పేట సర్కిల్, అగాడి, బిల్టప్, ఐటీఐ సర్కిల్, ఎర్రముక్కపల్లి, అంబేద్కర్, అప్సర, అన్నమయ్య, మహావీర్, గోకుల్ సర్కిళ్లలో సెవెన్ రోడ్స్, పాత బస్టాండ్, రవీంద్రనగర్, పెద్ద దర్గాలో ఏక కాలంలో తనిఖీలు నిర్వహించారు. ప్రొద్దుటూరు పట్టణంతో పాటు పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రదేశాల్లో కూడా ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించి ఆరా తీశారు. లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేసి లాడ్జీలలో రికార్డులు పరిశీలించారు.

అమరావతికి వెళ్తూ యానిమేటర్‌కు గాయాలు

ఓబులవారిపల్లె : అమరావతి పునర్నిర్మాణ సభకు వెళ్తూ ఒంగోలు వద్ద బస్సు టైర్ పగిలి జరిగిన ప్రమాదంలో యానిమేటర్ పత్ర కవితకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. అమరావతిలో మోదీ సభకు గురువారం రాత్రి మండలంలోని ఎస్‌హెచ్‌జీ బృందాల మహిళలు ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. ఒంగోలు చేరగానే.. బస్సు వెనుక టైర్ పెద్ద శబ్దంతో పేలింది. ఓబులవారిపల్లె మండలం శంకరాపురం దళితవాడకు చెందిన పత్ర కవిత, మంగళంపల్లె గ్రామానికి చేందిన గీతకు గాయాలయ్యాయి. వారిని తిరుపతి బర్డ్ ఆసుపత్రికి తరలించారు. సభకు వెళ్తూ పత్ర కవిత గాయపడినా నాయకులు పట్టించుకోలేదని రైల్వేకోడూరు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జోతి చిన్నయ్య విమర్శించారు.

చెట్టుకు ఉరివేసుకొని తిరుపతి వాసి మృతి

రాయచోటి : రాయచోటి రూరల్ మండలం జంగం రెడ్డిగారిపల్లె సమీపంలో చింత చెట్టుకు ఉరివేసుకుని కోటకొండ రెడ్డప్ప(40) మృతి చెందినట్లు రాయచోటి అర్బన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి టౌన్ ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న రెడ్డప్ప జంగమరెడ్డిగారిపల్లెలోని కుమార్తె దేరంగుల మాధవి ఇంటికి ఐదు రోజుల కిందట వచ్చారు. మద్యం తాగడం మానుకోవాలంటూ కుమార్తె మాధవి చెప్పింది. మద్యానికి బానిసైన రెడ్డప్ప మద్యం తాగకుండా ఉండలేక గురువారం రాత్రి అందరూ పడుకున్న తర్వాత ఇంటి నుంచి వెళ్లి మామిడితోటలోని చింత చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందారు. రెడ్డప్ప కుమార్తె దేరంగుల మాధవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.